సాక్షి
విశాఖపట్నం


శనివారం | 20 | సెప్టెంబర్ | 2025



దసరా సందడి షురూ! IIలో



కేజీహెచ్‌లో కమీషన్ల చిచ్చు IIలో



నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం IIలో



ర్యాలీలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, సమన్వయకర్తలు వాసుపల్లి, అదీప్‌రాజ్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, పార్టీ నేతలు జాన్ వెస్లీ, రాజీవ్‌గాంధీ తదితరులు

హోరెత్తిన మెడికల్ 'పోరు'

చలో మెడికల్ కాలేజ్ విజయవంతం

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ కుట్రపై వైఎస్సార్ సీపీ పోరుబాట
- పోలీసుల నిర్బంధాన్ని ఛేదించి నిరసన
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

సాక్షి, పాడేరు: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన 'చలో మెడికల్ కాలేజ్' విజయవంతమైంది. విశాఖ, అల్లూరి జిల్లాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు పాడేరుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజా వ్యతిరేకతను చూసి భయపడిన ప్రభుత్వం.. తన నిరంకుశ ధోరణిని మరోసారి బయటపెట్టుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలను వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో నేతలు పోలీసులను నిలదీశారు. ప్రభుత్వ ఆదేశాలతోనే ఈ నిర్బంధకాండ కొనసాగుతోందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అక్కడకు చేరుకుని, పోలీసులతో వాదించారు. వారి వాదనల తీవ్రతకు తలొగ్గిన పోలీసులు.. వాహనాలను విడిచిపెట్టడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పాడేరుకు కదంతొక్కాయి. జై జగన్, సీఎం చంద్రబాబు డౌన్‌డౌన్ నినాదాలతో పాడేరు వీధులు మార్మోగాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వైద్య కళాశాల వరకు జరిగిన భారీ ర్యాలీ.. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో పేరుకుపోయిన ఆగ్రహానికి అద్దం పట్టింది. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద నేతలు, కార్యకర్తలు బైఠాయించారు. పాడేరు వైద్య కళాశాలలో తరగతులు జరుగుతున్నా.. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు సవిత, అనితలకు కనిపించడం లేదా అని వారు మండిపడ్డారు. పేదలకు ఉన్నత వైద్యాన్ని దూరం చేసే ఈ కుట్రను తిప్పికొడతామని హెచ్చరించారు.

పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, అల్లూరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎంపీ తనూజరాణి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, ఉత్తరాంధ్ర జోన్ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు కె.భాగ్యలక్ష్మి, వాసుపల్లి గణేష్‌కుమార్, చెట్టి పాల్గుణ, చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయ చంద్ర, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఉత్తరాంధ్ర యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అంబటి శైలేష్, అల్లూరి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గబ్బాడ శేఖర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు లోచలి వరప్రసాద్. విశాఖ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాడేరు వస్తున్న విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు



నిరసన ర్యాలీకి తరలివస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కదంతొక్కిన యువత

మాకవరపాలెం: వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన గళం హోరెత్తింది. వైఎస్సార్ సీపీ పిలుపుతో పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'చలో మెడికల్ కాలేజ్'కార్యక్రమం ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను బలంగా వ్యక్తపరచింది. పీపీపీ విధానం పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేసేందుకేనని నేతలు మండిపడ్డారు. ఈ ఆందోళనలో పాల్గొనేందుకు జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, యువత వస్తుండగా బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. మాకవరపాలెం మండలంలోని భీమబోయినపాలెంలో గల మెడికల్ కళాశాల ప్రాంతానికి చేరుకున్న నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను ముందుగా పోలీసులు అడ్డుకుని, నిరసనలు, ఆందోళనలకు అనుమతి లేదని, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని నోటీసులు జారీ చేశారు. 15 మందికి మించి వెళ్లకూడదనే ఆంక్షలు పెట్టారు. అయినా తగ్గేదేలే అంటూ.. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత గళమెత్తింది.



నిరసనలో పాల్గొన్న గణేష్, శోభా హైమావతి, ఈర్లె అనురాధ, యువజన నేత వెంకటేష్

విద్య, వైద్యానికి పెద్దపీట



రాష్ట్రంలో విద్య, వైద్యానికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి చరిత్రలో నిలిచిపోయారు. పేద విద్యార్థులు డాక్టర్లు అవ్వాలని వెనుకబడిన ప్రాంతాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తే.. కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పాడేరు వైద్య కళాశాల 70 శాతం నిర్మాణం పూర్తి చేసుకుంది. గత విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ వాస్తవాలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఎందుకు కనబడటం లేదు. గిరిజనులకు దుప్పట్లు, పండ్లు పంపించామని చెప్పుకోవడం కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా గిరిజనాభివృద్ధికి శాశ్వత పరిష్కారం చూపాలి.

– కేకే రాజు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

17 వైద్య కళాశాలలు చరిత్రాత్మకం



రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం చారిత్రాత్మకం. గిరిజనులకు 500 పడకలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టింది. 70 శాతం పనులు పూర్తయితే కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది.

– అదీప్‌రాజ్,యువజన విభాగం ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వైఎస్సార్ సీపీ

వైద్య విద్య దూరం చేయొద్దు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 17 వైద్య కళాశాలల్లో పదింటిని ప్రైవేట్‌పరం చేసి పేదలకు వైద్య విద్య, వైద్య సేవలు దూరం చేయడం అన్యాయం. సీఎం చంద్రబాబు బినామీలు, బంధువులకు వీటిని అప్పగించే చర్యలను అడ్డుకుంటాం. ఐదు వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభమైనప్పటికీ కూటమి పాలకులు తప్పుడు ప్రచారం చేయడం దారుణం. – డాక్టర్ తనూజరాణి,అరకు ఎంపీ

పెండింగ్ పనులపై నిర్లక్ష్యం



ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. పాడేరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాల మంజూరు చేసి రూ.500 కోట్లతో పనులు చేపట్టారు. పెండింగ్ పనులు పూర్తి చేయడంతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

– జల్లిపల్లి సుభద్ర, జెడ్పీ చైర్‌పర్సన్

పాలకులకు కళ్లు కనబడటం లేదా?



పాడేరు వైద్య కళాశాలలో 70 శాతం పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. గత విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు కూడా పూర్తయితే కూటమి పాలకులకు కళ్లు కనబడ లేదా? పాడేరు వంటి మారుమూల ప్రాంతంలో వైద్య కళాశాల నిర్మాణం గిరిజనులకు వరం.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం

ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదు



రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తే ఊరుకునేది లేదు. పేదలకు ఉచిత వైద్య విద్య, కార్పొరేట్ వైద్యం లక్ష్యంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మారుమూల పాడేరు ప్రాంతంలో కూడా రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 70 శాతం మేర పాడేరు కళాశాల నిర్మాణ పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది. మిగతా 30 శాతం పనులను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. – మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు

సమష్టి కృషితో విశాఖను అగ్రస్థానంలో నిలుపుదాం

కలెక్టర్ల కాన్ఫరెన్స్ వివరాలను వెల్లడించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాను అగ్రస్థానంలో నిలపడానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను శుక్రవారం జిల్లా అధికారులకు వివరించిన ఆయన, 'స్వర్ణాంధ్ర 2047' విజన్ డాక్యుమెంట్‌లోని పది సూత్రాల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, పట్టణాల్లో నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. మత్స్యకారులకు ఆధునిక సాంకేతికతను అందించాలని, పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని చెప్పారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, గృహ నిర్మాణ పథకాలు, 'ప్రసాద్' పథకం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత విశాఖను నిర్మించడానికి కృషి చేయాలని, కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించాలని సూచించారు. పోర్టు, పరిశ్రమలలో పారిశుధ్య చర్యలను డ్రోన్ల సహాయంతో పరిశీలించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు తెలిపారు. రెవెన్యూ పెంచడానికి ఆస్తుల పన్ను, నీటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని కోరారు. 'బంగారు కుటుంబాలను' దత్తత తీసుకునే ప్రక్రియను ప్రోత్సహించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్. చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

ఆన్‌లైన్‌లో మహిళా వరల్డ్ కప్ టికెట్లు

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ అభిమానులకు శుభవార్త. ఐసీసీ వుమెన్స్ క్రికెట్ వరల్డ్ కప్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. కేవలం వంద రూపాయల కనీస ధరకే టికెట్లను https://tickets.cricketworldcup.com/ వెబ్‌సైట్‌లో కొనుగోలు చేయవచ్చు. కాగా.. మహిళా క్రికెటర్ల కలలను, ఉత్సాహాన్ని పెంపొందించేందుకు గాయని శ్రేయాఘోషల్ పాడిన 'బ్రింగ్ ఇట్ హోమ్' అనే అధికారిక సాంగ్‌ను కూడా విడుదల చేశారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా విశాఖ ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఇందులో భారత మహిళా జట్టు రెండు కీలక మ్యాచ్‌లు ఆడనుంది. అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 12న ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. అక్టోబర్ 13న బంగ్లాదేశ్‌తో దక్షిణాఫ్రికా(డే నైట్ – మధ్యాహ్నం 3 గంటలకు), అక్టోబర్ 16న ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ (డే నైట్–మధ్యాహ్నం 3 గంటలకు), అక్టోబర్ 26న ఇంగ్లాండ్‌తో న్యూజిలాండ్ (ఉదయం 11 గంటలకు) జట్ల మధ్య పోటీ ఉండనుంది.

346 వాహనాలు యజమానులకు అప్పగింత



వాహనం కీని అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన 346 వాహనాలను యజమానులకు అప్పగించేందుకు మూడో విడత వెహికల్ రిటర్న్ మేళాను నిర్వహించినట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పలు కేసుల్లో పట్టుకున్న వాహనాలను, చోరీకి గురైన వాటిని ఎలా తీసుకోవాలో తెలియక చాలా మంది యజమానులు వదిలేస్తున్నారని పేర్కొన్నారు. కొంత మంది కోర్టుల నుంచి రిలీజ్ చేసుకోవడం తెలియక విడిపించుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని గ్రహించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విశాఖలో ఈ రిటర్న్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న తొలి దఫాలో 152, ఏప్రిల్ 22న రెండో దఫాలో 320 వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమంలో జరుగుతుందన్నారు. అనంతరం యజమానులకు సీపీ చేతుల మీదుగా వాహనాలను అందజేశారు.

కూటమిలో కూల్చివేతల కల్లోలం

- బడ్డీల తొలగింపు ప్రక్రియతో టీడీపీ, జనసేనల మధ్య చిచ్చు
- మేయర్‌పై జనసేన ఎమ్మెల్యే వంశీ ఫైర్
- తనకు సమాచారం లేకుండా ఎలా తొలగిస్తారని ఆగ్రహం
- దీని వెనుక ఎంపీ భరత్ హస్తం ఉందని జనసేన నేతల ఆరోపణ
- కూటమి పార్టీలకు వ్యాపార, ప్రజా, వామపక్షాల నిరసన సెగ

విశాఖ సిటీ : బడ్డీల తొలగింపు ప్రక్రియ కూటమిలో కల్లోలం రేపుతోంది. టీడీపీ, జనసేన పార్టీల మధ్య చిచ్చు రాజేస్తోంది. ఏళ్ల తరబడి చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారి పొట్ట కొట్టడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే విశాఖలో కూటమి పార్టీలకు వ్యాపార, ప్రజా, వామపక్షాల సెగ తగులుతోంది. దీంతో కూటమి పార్టీల ప్రజాప్రతినిధుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. విశాఖ దక్షిణ జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నేరుగా మేయర్ పీలా శ్రీనివాసరావునే టార్గెట్ చేశారు. తన నియోజకవర్గంలో నైట్ ఫుడ్‌కోర్టులో బడ్డీలను ఎవరికి చెప్పి తొలగించారని గట్టిగా ప్రశ్నించారు. ఇది హేయమైన చర్యగా అభివర్ణించారు. తనకు తెలియకుండా ఫుడ్‌కోర్టును తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేయడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

టూర్‌కు వెళ్లిన సమయంలో తెలివిగా..

నగరంలో ఫుట్‌పాత్‌లపై దశాబ్దాలుగా చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారి బడ్డీలను, ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద ఉన్న నైట్‌ఫుడ్ కోర్టును తొలగించాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. మేయర్, కార్పొరేటర్లు నగరంలో ఉన్న సమయంలో వీటిని తొలగిస్తే వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేక వస్తుందని భావించారు. ప్రస్తుతం మేయర్, కార్పొరేటర్లు అధ్యయన యాత్ర పేరుతో ఉత్తర భారతదేశం పర్యటనకు వెళ్లారు. అలాగే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు సైతం అమరావతిలో ఉన్నారు. ఇదే మంచి సమయమని భావించిన ప్రజాప్రతినిధులు నగరంలో బడ్డీలను తొలగించాలని జీవీఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారి ఆదేశాల మేరకే అధికారులు నగరంలో చిరువ్యాపారులపై విరుచుకుపడుతున్నారు. వారి జీవనాధారం దూరం చేసి పొట్టకొడుతున్నారు. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా బడ్డీలను ధ్వంసం చేయడాన్ని ప్రజా సంఘాలు సైతం తప్పుబడుతున్నాయి. అన్ని వైపుల నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన జ్వాలలు రగులుతున్నాయి. ఇప్పుడు ఇదే అంశం కూటమి పార్టీల్లో అగ్గి రాజేస్తోంది.

భగ్గుమంటున్న జనసేన

టీడీపీ ప్రజాప్రతినిధుల ఆదేశాలతోనే ఈ బడ్డీల తొలగింపు ప్రక్రియను చేపడుతున్నారని జనసేన నేతలు బహిరంగంగానే ఆరోపణలు చేస్తుండడం దుమారం రేపుతోంది. ప్రధానంగా జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ మేయర్ పీలా శ్రీనివాసరావుపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. ఎమ్మెల్యేగా తనకు ఎటువంటి సమాచారం లేకుండా నైట్‌ఫుడ్ కోర్టును తొలగించి కమిషనర్‌పై నెపం నెట్టడాన్ని మేయర్‌పై మండిపడ్డారు. అలాగే దీని వెనుక విశాఖ ఎంపీ శ్రీభరత్ హస్తం కూడా ఉందని జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. తెరవెనుక ఆదేశాలతోనే జీవీఎంసీ అధికారులు ఇంతటి దుశ్చర్యకు తెరలేపారని బహిరంగంగానే ప్రకటనలు చేస్తుండడం గమనార్హం. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ పర్యటన సమయంలో మేయర్, కార్పొరేటర్లు లేకపోవడాన్ని జనసేన నేతలు తప్పుబడుతున్నారు. ఈ నెల 17న సీఎం విశాఖకు వచ్చారు. ఒక రోజు ముందే మేయర్, కార్పొరేటర్లు విహార యాత్రకు పయనమయ్యారు. ఒక రోజు ఆగి యాత్రకు వెళితే నష్టమేంటన్న ప్రశ్నలను సంధిస్తున్నారు. ఇప్పుడిదే విశాఖ రాజకీయాల్లో చర్చనీయాంశమవుతోంది.

నోరు మెదపని టీడీపీ ఎమ్మెల్యేలు

నగరంలో అన్ని నియోజకవర్గాల్లో వ్యాపారుల పొట్టే కొట్టే కార్యక్రమం జరుగుతోంది. కానీ టీడీపీ ఎమ్మెల్యేలు ఎవరూ ఇప్పటి వరకు నోరుమెదపకపోవడం విశేషం. ఒకవైపు తమ జీవనాధారం దూరం చేసి కుటుంబాలను రోడ్డు పాలు చేశారని చిరువ్యాపారులు రోడ్ల మీదకు వచ్చి నిరసనలకు దిగుతున్నారు. కానీ తెలుగుదేశం తమ్ముళ్లు దీనిపై కిక్కురుమనడం లేదు. దీంతో టీడీపీ ప్రజాప్రతినిధుల ఆదేశాలతోనే ఈ తతంగం జరుగుతోందన్న విషయం అర్థమవుతోందని జనసేన నేతలు చెబుతున్నారు.



ఫుడ్‌కోర్టు వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్న దుకాణదారులు



అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో బడ్డీల తొలగింపు



మహిళను వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

మా ప్రభుత్వంలోనే తిప్పలా..



ప్రభుత్వంపై మండిపడుతున్న దుకాణదారులు (చిత్రంలో బ్యాడ్జీలతో టీడీపీ, జనసేన కార్యకర్తలు)

దాబాగార్డెన్స్: ' మా కూటమి ప్రభుత్వంలోనే మాకు తిప్పలా? ఫుడ్‌కోర్టు ఎక్కడికి పోదని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీనిచ్చారు. పవన్ కల్యాణ్ కూడా రోడ్డుపై బతుకుతున్న వారికి ఏ నష్టం జరగకూడదన్నారు. మా జోలికి ఎవరూ రారన్నారు. ఫుడ్‌కోర్టులో ఉన్న వారమంతా జనసేన, టీడీపీ వాళ్లం. అయినా మా దుకాణాలు తొలగించారు. మేమంతా రోడ్డున పడ్డాం. మాకే ఈ గతి పట్టిందంటూ'' ఫుడ్‌కోర్టు వ్యాపారస్తులు(జనసేన, టీడీపీ కార్యకర్తలు) మీడియా ముందు వాపోయారు.

కౌన్సిల్ తీర్మానం మేరకే ఫుడ్‌కోర్ట్ తొలగింపు

దాబాగార్డెన్స్: కౌన్సిల్ తీర్మానానికి అనుగుణంగానే పాత జైల్ రోడ్డు వద్ద ఉన్న ఫుడ్ కోర్ట్‌లో ఆక్రమణలు తొలగించడం జరుగుతుందని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. ఫుడ్ కోర్ట్‌లో 160 దుకాణాలు అనధికారకంగా నిర్వహిస్తున్నారని.. 60 మంది వ్యాపారస్తులు శుక్రవారం రాత్రి 8 గంటలకు స్వచ్ఛందంగా దుకాణాలు తరలించారని పేర్కొన్నారు. ఈ ఫుడ్ కోర్ట్ తొలగింపు కోసం కౌన్సిల్‌లో 2025 ఆగస్టు 22వ తేదీన తీర్మానం జరిగిందని తెలిపారు. ఫుడ్ కోర్ట్ తొలగించాలని పీజీఆర్ఎస్‌లో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు.

రెండో రోజూ 529 ఆక్రమణల తొలగింపు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో 'ఆపరేషన్ లంగ్స్'లో భాగంగా రెండో రోజూ శుక్రవారం 529 ఆక్రమణలు తొలగించినట్లు చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. గురువారం 524 ఆక్రమణలు తొలగించామన్నారు. గురు, శుక్రవారాల్లో అన్ని జోన్లలో 1,053 ఆక్రమణలు తొలగించినట్టు తెలిపారు.

జోన్ల వారీగా తొలగింపులు ఇలా..

- జోన్–1 పరిధి 1, 2, 3 వార్డుల్లో తగరపువలస మెయిన్‌రోడ్డులో 40 ఆక్రమణలు, తగరపువలస మెయిన్ రోడ్డు నుంచి భీమిలి రోడ్డులో 35 ఆక్రమణలు.
- జోన్–2 పరిధి 7, 8 వార్డుల్లో జాతీయ రహదారి–16 మిథిలాపురి వుడా రోడ్డు నుంచి గాంధీ విగ్రహం వరకు 35 ఆక్రమణలు. 11, 12, 13 వార్డుల్లో శ్రీకాంత్‌నగర్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్, తోటగరువు జంక్షన్ మీదుగా అంబేడ్కర్ జంక్షన్, తోటగరువు జంక్షన్ మీదుగా పెదగదిలి జంక్షన్ వరకు 51 ఆక్రమణలు.
- జోన్–3 పరిధి 27వ వార్డులో జాతీయ రహదారి అక్కయ్యపాలెం నుంచి దొండపర్తి వరకు 49, అలాగే దొండపర్తి నుంచి డైమండ్ పార్క్ వరకు 22 ఆక్రమణలు.
- జోన్–4 పరిధి 32వ వార్డులో అంబేడ్కర్ సర్కిల్ నుంచి జైల్‌రోడ్డు ఇందిరమ్మ విగ్రహం వరకు 11 ఆక్రమణలు.
- జోన్–5 పరిధి 48వ వార్డులో సీఐఎస్ఎఫ్ గేట్ నుంచి ఎన్‌జీజీవోస్ కాలనీ బస్‌స్టాప్ వరకు 3 ఆక్రమణలు. 49వ వార్డులో ఎన్‌జీజీవోస్ కాలనీ బస్టాప్ నుంచి అయ్యప్పనగర్ బస్టాప్ వరకు 45 ఆక్రమణలు, 50వ వార్డులో అయ్యప్పనగర బస్టాప్ నుంచి మాధవదార జంక్షన్ వరకు 10, అలాగే 51వ వార్డులో మాధవదార జంక్షన్ నుంచి మేరియట్ హోటల్ జంక్షన్ వరకు 8 ఆక్రమణలు.
- జోన్–6 పరిధి 65, 66, 67 వార్డుల్లో పాత గాజువాక ప్రధాన రహదారి నుంచి కొత్త గాజువాక ప్రధాన రహదారి వరకు, రాజీవ్‌నగర్ మార్గ్ రెండు వైపుల 98 ఆక్రమణలు. 72, 73, 74 వార్డుల్లో 130 అడుగుల రోడ్డు, సమతానగర్ జంక్షన్ నుంచి వంటిళ్లు జంక్షన్ వరకు 12 ఆక్రమణలు. అలాగే 66, 72, 73, 74 వార్డుల్లో కణితిరోడ్డు, జగ్గు జంక్షన్ నుంచి కొత్తగాజువాక జంక్షన్ వరకు 18 ఆక్రమణలు.
- జోన్–7 పరిధి 81వ వార్డులో నెహ్రూ చౌక్ నుంచి బైపాస్ జంక్షన్ వరకు 52 ఆక్రమణలు.
- జోన్–8 పరిధి 90, 92 వార్డుల్లో ఎన్ఎస్‌టీఎల్ జంక్షన్ నుంచి కుమారి కల్యాణ మండపం వరకు 25 ఆక్రమణలు. గోపాలపట్నం సింహాచలం ద్వారం జంక్షన్ నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు 15 ఆక్రమణలు తొలగించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ దొండపర్తి 33/11కేవీ, టీఎస్సార్ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం జోన్-3, జోన్-4 పరిధిలో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా నిర్వహణ విభాగం ఈఈ మురళీకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం కారణంగా ఆయా జోన్ల పరిధిలో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

జోన్-3 పరిధిలో..

జీవీఎంసీ 19వ వార్డులోని లాసన్స్‌బే కాలనీ, పెద జాలారిపేట, 21వ వార్డులోని చినవాల్తేర్, పెదవాల్తేర్, 22వ వార్డు పిఠాపురం కాలనీ, పీతలవాని పాలెం, శివాజీపాలెం, 23వ వార్డు కేఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం, చైతన్యనగర్, కృష్ణా కాలేజ్ రోడ్డు, 25వ వార్డు సీతమ్మపేటలో పలు ప్రాంతాలు, 27వ వార్డు శ్రీనగర్, ద్వారకానగర్, రామాటాకీస్ తదితర ప్రాంతాలు

జోన్-4 పరిధిలో..

జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్, నెహ్రూనగర్, పితానిదిబ్బ, భానోజీనగర్, 29వ వార్డు ప్రకాశరావుపేట, వెంకటేశ్వర నగర్, కృష్ణానగర్, దండుబజార్, దిబ్బలపాలెం, 30వ వార్డు జాలారిపేట, సాలిపేట, తాడివీధి, కుమ్మరవీధి, కోడిపందాల వీధి, 31వ వార్డు గొల్లలపాలెం, డాబాగార్డెన్స్, ఎస్‌బీఐ కాలనీ, జగదాంబ జంక్షన్ రోడ్డు, కనకలదిబ్బ తదితర ప్రాంతాలు

అత్యవసర ప్రాంతాలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తామని ఈఈ తెలిపారు. 21వ తేదీ ఆదివారం నుంచి యథాతథంగా నీటి సరఫరా ఉంటుందని తెలియజేశారు.

25న తపాలా డాక్ అదాలత్

ఎంవీపీకాలనీ : తపాలా వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 25న ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయంలో 119వ తపాలా డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన తపాలా వినియోగదారులు వారి సమస్యలను ఈ నెల 22వ తేదీ లోపు ఎంవీపీ కాలనీలోని రీజనల్ కార్యాలయం చిరునామాకు అందజేయాల్సి ఉంటుంది.

కేజీహెచ్‌లో కమీషన్ల చిచ్చు

- రూ.7 కోట్ల కొనుగోళ్లలో రూ.42 లక్షల కమీషన్
- సొమ్ము పంపకాల్లో తేడాతో అధికారుల్లో విభేదాలు
- మరోసారి వార్తల్లో నిలిచిన ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి



మహారాణిపేట: ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ ఇటీవల కాలంలో తరచూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆసుపత్రిలో ఉన్నతాధికారుల మధ్య కమీషన్ల పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలు, కుమ్ములాటలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇటు కేజీహెచ్‌లో.. అటు వైద్య ఆరోగ్య శాఖలో పంపకాల బాగోతం హాట్‌టాపిక్‌గా మారింది. ఇటీవల ఆసుపత్రిలో ఆక్సిజన్, సర్జికల్ పరికరాలు, మందుల కొనుగోలు కోసం సుమారు రూ. 7 కోట్లు వెచ్చించారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి దాదాపు రూ.42 లక్షలు కమీషన్‌గా చేతులు మారినట్లు సమాచారం. అయితే, ఈ కమీషన్ డబ్బు పంపకాల్లో తేడాలు రావడంతో పరిపాలన విభాగాల్లోని అధికారుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. వాటాల విషయంలో తలెత్తిన వివాదం ఎంతగా ముదిరిందంటే, ఒక అధికారి చాంబర్‌లో చెక్కులు, కాగితాలు విసిరికొట్టే స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. వివిధ విభాగాల గుమస్తాలు, అధికారుల నుంచి ఉన్నత స్థాయి వరకు పంపకాలు జరిగాయని సమాచారం. కేవలం ఈ ఒక్క సంఘటనే కాదు.. కేజీహెచ్‌లో అవినీతి వ్యవస్థీకృతంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమ్యామ్యాల ముట్టజెప్పకపోతే కొనుగోళ్లు, టెండర్లు, ఇతర పనులకు సంబంధించిన ఫైళ్లు ముందుకు కదలవని, వాటిని ఏదో ఒక మూలన పడేస్తున్నారని సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. ప్రతి పనికి డబ్బులు లంచంగా ఇవ్వనిదే జరగని పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కమీషన్ల బాగోతం బయటకు పొక్కడంతో.. నీ వల్లే బయటపడింది అంటూ అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నట్లు సమాచారం. కేజీహెచ్‌లో ఈ అవినీతి జాడ్యం ముదరకముందే కలెక్టర్ జోక్యం చేసుకుని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



అంతర్ కళాశాల క్రీడాకారులతో వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఏయూ అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో భాగంగా పురుషుల కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఏయూ జిమ్నాజియం కబడ్డీ మ్యాట్‌పై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ గుర్తింపు పొందిన కళాశాలల కబడ్డీ క్రీడాకారులు పాల్గొనడంపై అభినందనలు తెలిపారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏయూలోని క్రీడా మైదానాలను సింథటిక్ మైదానాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. అలాగే, ఈ సంవత్సరం నుంచి ఇంటర్ కాలేజియేట్ క్రీడల్లో పాల్గొనే వారికి భోజన సదుపాయంతో పాటు, ఇతర యూనివర్సిటీలకు వెళ్లే క్రీడాకారుల డీఏను పెంచినట్లు వివరించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్ మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన అనుబంధ కళాశాలల నుంచి 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో సుమారు 35 జట్లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి, ఐఐపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ జి. వెంకటేశ్వరరావు, పలు కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల ఫలితాలు

- చింతపల్లి డిగ్రీ కళాశాల, సాంకేతిక కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో సాంకేతిక కళాశాల 15 పాయింట్లతో గెలిచింది.
- గరివిడి గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, నర్సీపట్నానికి జరిగిన మరో మ్యాచ్‌లో గరివిడి 7 పాయింట్ల ఆధిక్యంతో గెలిచింది.
- ఏవీఎన్ కళాశాల, వాగ్దేవి కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాగ్దేవి 3 పాయింట్ల ఆధిక్యంతో నిలిచింది.
- జీడీసీ పాడేరు, జీడీసీ తగరపువలస మధ్య జరిగిన మ్యాచ్‌లో జీడీసీ పాడేరు 16 పాయింట్లతో విజయం సాధించింది.
- స్పెష్ డిగ్రీ కళాశాల, జీడీసీ సబ్బవరం మధ్య జరిగిన మ్యాచ్‌లో సబ్బవరం 15 పాయింట్లతో గెలిచింది.
- ఎంవీఆర్ డిగ్రీ కాలేజ్, ఆదిత్య మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎంవీఆర్ 9 పాయింట్ల ఆధిక్యంతో విజేతగా నిలిచింది.

దసరా సందడి షురూ!





నాలుగు రోజుల ముందుగానే దసరా పండగ వాతావరణం మొదలైంది. అమ్మవారి విగ్రహాలు ఇప్పటికే సిద్ధమై, వివిధ మండపాలకు తరలివెళుతున్నాయి. దీంతో నగర వీధులన్నీ సందడిగా మారాయి. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించడం, ప్రత్యేక ఏర్పాట్లు చేయడం వంటి పనులు వేగవంతమయ్యాయి. ఈ సంవత్సరం కూడా భక్తులను ఆకట్టుకునేలా మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం




ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే రణభేరి



ఆనందపురం రణభేరి కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల రక్షణ, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసమే రణభేరి బైక్‌జాతా నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్, కోశాధికారి రెడ్డి మోహనరావు అన్నారు. ఆనందపురంలో రణభేరి కార్యక్రమాన్ని శుక్రవారం డప్పు మోగించడం ద్వారా వీరు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 కేంద్రాలలో రణభేరి ప్రచారజాతా జరుగుతుందన్నారు. అనంతరం వీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న సాల్ట్ పథకాన్ని విమర్శించారు. దీనివలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నాణ్యత, ఎన్‌రోల్‌మెంట్ పెరగకపోగా తగ్గుదల కనిపిస్తోందన్నారు. దీనికి ఉపాధ్యాయులు సరిగా బోధన చేయడం లేదని సాకుగా చూపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. యాప్‌లతోనే పాఠశాల సమయం హరించుకుపోతోందని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. 2023 జూలై నుంచి రావలసిన 12వ పీఆర్సీ 25 నెలలు గడిచినా ఇవ్వలేదన్నారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ ఇవ్వలేదన్నారు. తప్పనిసరి పరిస్థితిలో నిర్వహిస్తున్న ఈ రణభేరి ఈ నెల 25న గుంటూరులో ముగుస్తుందన్నారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కిషోర్, శ్రీలక్ష్మి, పూర్వ రాష్ట్ర సహాధ్యక్షురాలు కోరెడ్ల విజయగౌరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్, ఎస్.ప్రభాకర్, ఎ.పైడిరాజు, విజయకుమారి, రాంబాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై కార్పొరేటర్ మూర్తి దుర్భాషలు?

మనస్తాపంతో చేతికి గాయం చేసుకున్న స్టాఫ్‌నర్స్

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పరిధిలోని పిఠాపురం కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ స్టాఫ్ నర్స్ శుక్రవారం తన చేతికి గాయం చేసుకుంది. కార్పొరేటర్ మూర్తి యాదవ్ తీరుతో మనస్తాపం చెందిన ఆ స్టాఫ్ నర్సు చేతికి గాయపరుచుకున్నట్టు తెలిసింది. గురువారం ఈ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సందర్శించారు. ఆయనతో పాటు స్థానిక కార్పొరేటర్ మూర్తి యాదవ్ కూడా వెళ్లారు. ఆ సమయంలో వైద్యాధికారి, స్టాఫ్ నర్సులు విధుల్లో లేరు. దీంతో డీఎంహెచ్‌వో వారి మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అక్కడే ఉన్న కార్పొరేటర్ సిబ్బందిని తీవ్రమైన పదజాలంతో దూషించినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన ఆ స్టాఫ్ నర్సు తీవ్ర మనస్తాపానికి లోనై శుక్రవారం తన చేతికి గాయపరుచుకున్నారని తెలిసింది. ఈ విషయంపై డీఎంహెచ్‌వోను సంప్రదించగా.. గురువారం హెల్త్ సెంటర్‌ను సందర్శించడానికి వెళ్లినట్లు తెలిపారు. ఆ సమయంలో విధుల్లో లేని వైద్యాధికారి, స్టాఫ్ నర్సులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ముందస్తు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే కార్పొరేటర్ సిబ్బందిపై దుర్భాషలాడిన విషయం తన దృష్టికి రాలేదని, అలాగే స్టాఫ్ నర్స్ గాయపరుచుకున్న విషయం కూడా తనకు తెలియదన్నారు.



చేతిని కోసుకుని గాయపర్చుకున్న స్టాఫ్‌నర్స్



చేతిపై గాయాలు

జోధ్‌పూర్‌లో జీవీఎంసీ బృందం

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక చర్చ

డాబాగార్డెన్స్: అధ్యయన యాత్రలో భాగంగా జీవీఎంసీ కార్పొరేటర్ల బృందం శుక్రవారం జోధ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించింది. మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, అధికారుల బృందం.. జోధ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ సౌత్ మేయర్ వనితా సేథ్, కమిషనర్ సిద్ధార్థ పళనిచామితో కలిసి సమావేశమైనట్లు జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా జోధ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న అభివృద్ధి పనులపై, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యం, తాగునీటి వనరుల సద్వినియోగం, పచ్చదనం అభివృద్ధి వంటి అంశాలపైనా చర్చ జరిగింది. ఈ వివరాలను జోధ్‌పూర్ మేయర్ బృందం వివరించింది. అలాగే విశాఖ నగరాభివృద్ధి, ఆదాయ వనరులు, రోడ్లు, రవాణా, జంక్షన్లు, పార్కుల అభివృద్ధి, నీటి శుద్ధి కర్మాగారాలు, డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, ఉద్యానవనాలు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు కార్యదర్శి రమణ తెలిపారు. అనంతరం జోధ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ విశాఖ కార్పొరేటర్లకు జ్ఞాపికలు అందజేసి, సత్కరించింది.



జోధ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జీవీఎంసీ మేయర్, కార్పొరేటర్ల బృందం

జీవీఎంసీ కాంట్రాక్టర్‌పై హత్యాయత్నం?

ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు

తాటిచెట్లపాలెం: ఎస్‌జీజీవోస్ కాలనీకి చెందిన తనని బెదిరించి, హత్యాయత్నం చేసినట్లు ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలివి. అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలో నివసిస్తున్న బావిశెట్టి జగదీశ్వర్రావు జీవీఎంసీలో కాంట్రాక్టర్. జీవీఎంసీ పరిధిలో జరుగుతున్న చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా వాహనాల గురించి కమిషనర్‌కు తెలియజేస్తున్నాడని ఆయనపై కర్రి శ్రీనివాసరెడ్డి, రఘు, నాగు అనుమానం పెంచుకున్నారు. ఆ ముగ్గురూ గురువారం రాత్రి జగదీశ్వర్రావుకు 89789 55477 నంబర్ నుంచి ఫోన్ చేసి.. తాము చెప్పిన చోటికి రమ్మన్నారు. అక్కడ ఆ ముగ్గురూ తనపై హత్యాయత్నానికి ప్రయత్నించారని జగదీశ్వర్రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై తగిన విచారణ జరిపించి, తనకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

విశాఖ సిటీ: రైలులో అక్రమంగా గంజాయి రవాణా చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని ఆర్‌పీఎఫ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రైలులో గంజాయి అక్రమ రవాణాపై ఆర్‌పీఎఫ్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆర్‌పీఎఫ్ అధికారులు సిబ్బంది శుక్రవారం మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో కిరండోల్-విశాఖపట్నం రైలులో గంజాయిని తరలిస్తున్న కేరళకు చెందిన మను జి.కృష్ణన్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా నుంచి బెంగళూరుకు గంజాయిని తరలించే ప్రయత్నం చేసినట్లు అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్టు చేశారు.

దుర్గాదేవి మండపాలకు అనుమతులు తప్పనిసరి

విశాఖ సిటీ: విజయ దశమి సందర్భంగా దుర్గాదేవి విగ్రహాలు ప్రతిష్ఠించే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పోలీస్, జీవీఎంసీ, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, ఫైర్, విద్యుత్ సంబంధిత శాఖల సమన్వయంతో ప్రారంభించిన http:// durgautsav.net సింగిల్ విండో వెబ్‌పోర్టల్ ద్వారా అనుమతి పొందాలని సూచించింది. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వారి మొబైల్ నెంబర్‌తో లాగిన్ మండపాల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం మండపాల వివరాలను పరిశీలించి సంబంధిత శాఖలు క్లియరెన్స్ ఇవ్వగా దాని తర్వాత జీవీఎంసీ తుది అనుమతులు మంజూరు చేస్తుందని పేర్కొంది. దరఖాస్తు చేసుకున్న వారికి క్యూఆర్ కోడ్ ఇస్తారని, దానిని డౌన్‌లోడ్ చేసుకుని మండపం వద్ద కనిపించేలా ప్రదర్శించాలని సూచించింది.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

తాటిచెట్లపాలెం: మరో మహిళతో భర్త ఉండడం చూసిన భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఫోర్త్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు..మారికవలసకు చెందిన పంచాలి శ్రీదేవి (37) తన భర్త ప్రకాశ్ నాయుడుతో కలిసి నివసిస్తోంది. ఆటో డ్రైవర్ అయిన ప్రకాశ్ నాయుడుకు ఒక కుమార్తె ఉంది. కొంతకాలంగా వీరిద్దరి మధ్య గొడవలు జరిగి విడివిడిగా ఉంటున్నారు. ఇటీవల పెద్దల సమక్షంలో రాజీ కుదరడంతో మళ్లీ కలిశారు. అయితే ప్రకాశ్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ప్రకాశ్ ఆటోలో బయటకు వెళ్లగా, అతని కోసం వెతుకుతూ శ్రీదేవి నగరానికి వచ్చింది. ఈ క్రమంలో మరో మహిళతో తన భర్తను చూడడంతో వారి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీదేవి వెంటనే పురుగుల మందు తాగింది. ఆమె కుమార్తె వెంటనే తల్లిని ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

24న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఈ నెల 24న నిర్వహించనున్న హ్యాకథాన్ పోస్టర్‌ను ఏయూ వీసీ జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 23లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య డి.లలితా భాస్కరి తెలిపారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025లో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని అల్గోరిథం భవనంలో కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అగ్రికల్చర్ ఫుడ్ టెక్ - రూరల్ డెవలప్‌మెంట్, బ్లాక్ చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ తదితర అంశాలపై హ్యాకథాన్ ఉంటుందని తెలిపారు. ఇందులో పాల్గొనే బృందంలో 6గురు సభ్యులుగా ఉండాలని, వారిలో కచ్చితంగా ఒక విద్యార్థిని ఉండాలని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌ఏఐ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ సిటీ: ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఎన్‌ఏఐ) 31వ రాష్ట్ర ద్వైవార్షిక సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అసోసియేషన్ అడ్వైజర్, గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి, సెయింట్ లూక్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కార్యదర్శి ఎం.ప్రీతం లూక్ మాట్లాడుతూ 'లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో-ది జర్నీ ఆఫ్ నర్సింగ్ స్టూడెంట్' థీమ్‌తో సమావేశాలను బీచ్ రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు హాజరవుతారని చెప్పారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్